రామరాజు

(ఒక కథ)

పానుగంటి లక్ష్మీనరసింహారావు గారు

"ఏహెహె, ఏహెహె! నేను జెప్పినమాట విను. మన కేదేవులాట వద్దు. తెలియలేదు? అదిసంగతి"యని పార్వతమ్మను మందలించుచు వెల్లపాటి రామరాజుగారు మఱ్ఱియాకుల విస్తళ్లు కుట్టుటకై పూచికపుల్లలు చీల్చుచుండెను. "నేను జెప్పినమాట రవంత లక్ష్యపెట్టఁగూడదా"యని భార్య భర్తను యాచించెను. "ఓయబ్బ! నీమాటకేమి? ఆడ తీరు గంటి క్రిందఁ బెట్టినమఱ్ఱాకులు సందెడు తోడుకొని యీడఁ బెట్టు. ఏదో యున్నదేదో యున్నది. ఉన్నంతమట్టుకుఁ గుట్లకెల్లఁ (కడుపునింప)దిని కూరుచుండక-యది లేదని యిది లేదని-దీని కేడకు? హద్దేడది?"యని రామరాజుగారనిరి. మఱ్ఱియాకులు తెచ్చి భర్తకిచ్చి పార్వతమ్మ భర్తయొద్దఁ గూరుచుండెను. వారిద్దఱు విస్తళ్లు కుట్టుకొనుచు మాటలాడుకొనుచుండిరి.

రామ:—ఏదో నాల్గుకాడిగట్లమాన్యమున్నదికదా. బఱ్ఱెలు రెండు గోదలు రెండున్నవికదా, చిన్న పెద్ద, దూడ దుడికి, గాజుల గాదెలలో మస్తుగా జొన్నగింజలు, సరికదా! అపరదినుసు లపురులుకదా! మఱెందుకు నాస లేదుగదా! ఇన్ని యున్నను మఱి దేనికో వెంకులాడుకొనుట (అపేక్షతోఁ దడుముకొనుట) తప్పుకాదా?

పార్వ:—ఒకబిడ్డఁడైన లేనప్పుడు మన కివి యన్నియు నెందులకు?

రామ:—ఆరాముఁ డున్నాఁడే. ఇవి యన్నియు మనకు దొడ్డుగా (ఎక్కువగా) నిచ్చినాఁడు. మన రెండుపొట్టల కింత దాఁకఁబని యేమున్నది? ఇవే యెక్కువయైనప్పుడింకను గొడుకొకఁడు కావలయు నని యడుగుకొనుట తప్పుకాదా?

పార్వ:—అందఱు సంసారులు కొడుకులఁ గని సుఖించుచుండ మన కెంతలోపమండి?

రామ:—ఓయబ్బ! నే నెఱుఁగనిసంసారాలా యేమి? మొఖాసాదారుపని చేసిన వెంకటరెడ్డిగారికిఁ గొడుకున్నాఁడా? నైజాము దేశములో సిద్ధిపొందిన మహాన్నప్రదాతయైన కొర్నిపాటి సుబ్బరాజుగారికిఁ గొడుకున్నాఁడా? పదునాల్గు శాస్త్రాలేమో చదివినాఁడఁట. ఆయన పేరేదో మంచిదబ్బ! ఆఁ! పరదేశిరాజుగారికిఁ గొడుకున్నాఁడా? సంసారి యైనప్పుడెల్ల కొడుకుండవలయు నని పట్టెందుకు? తప్పుకాదా?

పార్వ:—అయ్యయ్యో! ఆఁడుప్రాణము యొక్క కష్టము మీ కెట్లు తెలియునండి. ఒడిలో బిడ్డను బెట్టుకొని పాలిచ్చుకొనుట. ముద్దు

ముద్దుగాఁ బెంచుకొనుట. వాఁడు తాతా అత్తా యని చిట్టిచిట్టిమాట లాడుచుండఁగా విని సంతోషించుట-ఈసుఖమంతయు నాఁడుదాన నైననా కక్కఱలేదా?

రామ:-అదిగో ఆలాగన్నావు-బాగుగా నున్నది. తల్లిచచ్చిన బఱ్ఱెదూడ యున్నదే- దానికి రెండుపూఁటలను బాలుపోసికొని పెంచుకో - తెలియలేదు? దానిని ముద్దుపెట్టుకో. అదిగో తెలివితక్కువగా నవ్వుచున్నా వెందులకు? పుట్టినబిడ్డ బఱ్ఱెదూడకంటె నెక్కువ ముద్దురాదని నమ్ము. బిడ్డయెక్కువ యేమి? పెయ్యతక్కువ యేమి? దూడ నిచ్చినను రాముఁడే. బిడ్డనిచ్చినను రాముఁడే. తెలియలేదు? నీవు వట్టివెఱ్ఱిదానవు కాని. బిడ్డ అత్తా తాతా యనుట యెంతముద్దుగా నుండునో బఱ్ఱెదూడ 'ఏ ఏ' యని యఱచుట యంత ముద్దుగానే యుండును. తెలియలేదు? నీవు పెంచుకొనకపోవుటచేత నాముద్దు ముచ్చట నీ వెఱుఁగవు.

పార్వ:—ఎంత సేపు గొడ్డు గోద పాఁడి పంట - యీమాటలే కాని యిఱువదియైదేండ్లనుండి కాఁపురము చేయుచున్నారుకదా ఒక్కకొడుకైన లేకపోయెనని మీకుఁ గొసంత చింతయైన లేదేమండి?

రామ:—ఓసబ్బ! నాకుఁ జెప్పవచ్చినావా? కొడుకు లేఁడన్నచింత నడుమ నా కెందుకు? ఆచింత రామునికుండవలెను. మనకుఁ గొడుకు నీయనక్కఱలేదని ఆయన స్థిరపఱచుకొన్నాఁడేమో? తెలియలేదు? ఇఁక మాటలాడఁబోకు. రేపు కొయ్యదువ్వెన తెచ్చెదను. నూనె రాచి బఱ్ఱెదూడకు సొగసుగా దువ్వి - ఉన్నదేదో బాగుచేసికొవలయును గాని-ఏహెహే! లేనిదానికొఱకు_అదేమి వెఱ్ఱిదానా! కనుల నీరుపెట్టుకొందువేల?

పార్వ:—మనకు బిడ్డ నీయనక్కఱ లేదని రాముఁడు స్థిరపఱచుకొన్నాఁడంటిరా? ఇఁక మనగతి యింతే?

రామ:—ఇప్పు డున్నలోప మేమున్నది? ఇట్టి సాఁగినయెడల నదృష్టవంతుల మే. నేనొక మాట చెప్పుచున్నాను విను. లేదని యెన్నఁడు తలపోసికొకు. ఈయాలోచనయున్నదే ఇదే బెంగకు హేతువు. తెలియలేదు? మనస్సున కేమాత్రము పని యీయకు. కాళ్లతోఁ జేతులతోఁ బని చేసికొవలసినదే కాని యూరకే కూరుచుండి మనసుతో మాత్ర మెన్నఁడు పని చేయకు- తెలియలేదు? నీకుఁ బనిలేకపోయినప్పుడు రెండుకుంచాలజొన్నలు విసరి యా పిండి బుట్టలోఁ బోసికొని యూరువెంట బోయి నేను జేసినట్లే చీమలు మొదలగువానికిఁ బిచ్చుకలు మొదలగువానికి వేయుము- తెలియలేదు? జొన్నపిండిరొట్టెలు చేసి బీదపిల్లలయిండ్లకుఁ బోయి వారికిఁ బెట్టు. ఏదో యెప్పుడు మంచి పనిలో కదలికగా నుండవలసినదే కాని కాళులు చాచుకొని కూరుచుండి కడుపు కాయలేదని యెన్నఁడు చింతింపకు. కొడుకు లేఁడన్నందుల కొకయేడుపా? ఏడనో విరుద్ధపు మాట. కొడుకు పుట్టి బాగుగా నుండునెడలఁ గోడలు లేదని మఱియొకయేడుపా? కొడుకు కోడలున్నయెడల మనుమడు లేఁడని మఱి యింకొకయేడుపా? ఏహెహే! నీయేడుపునకు

నా కర్థమగపడుట లేదు. అనవసరముగా నేడ్చుటవలన రాముఁ డేమనుకొనునో కాసంత కనిపట్టనక్కఱలేదా?

పార్వ:—రాముఁడు మీకు దైవము కదా! ఒక్కబిడ్డనిమ్మని యాయనకు మ్రొక్కుకొనఁగూడదా!

రామ:—ఓయబ్బ! నన్ను దేవుని బ్రార్థింపుమంటివా? ఎంతమాట! దేవు నెన్నఁడు ప్రార్థింపఁగూడదని నేనుసిసలుపఱచుకొన్నాను. తెలియలేదు? ఎందుచేతనో చెప్పనా? ఏవెఱ్ఱి మొఱ్ఱిప్రార్థనయో మొదలుపెట్టఁగానే నాకది కావలయు నిదికావలయునన్న పనికిమాలిన యాసు లాడక తప్పదు. మోక్షమైనను గావలయునని కోరుకొనకతప్పదు కదా! అట్లు కోరుకొనుటయైనఁ దప్పే. మరల రక్షింపవలయునని రాముఁ డెఱుఁగఁడనుకొన్నావా యేమి? ఆతఁ డెన్నికనులఁ గనిపట్టుచున్నాఁడో నీవెప్పుడైన పరకాయించినావా? ఇష్టమువచ్చియిచ్చునా-సంతోషము. ఈయఁడు? అంతకంటె సంతోషము. ఈయఁదలంచుకొన్నవానిని బ్రార్థింపనక్కఱలేదు. ఈయఁదలఁచుకోనివానిని బ్రార్థింపనక్కఱలేదు- తెలియలేదు?

పార్వ:-ఈయఁదలఁచుకొనకున్నను మన భక్తిని మనయార్తిని గని యాతఁ డీయఁ గూడదా?

రామ:—ఓయబ్బ! నా కీకఁ జెప్పకు. రామదేవుని నే నేమియుఁ గోరను. క్రిందటి పుట్టువున నేది కోరుటచేతనో యీగఁపసిఁడి యిప్పుడు నాకుఁ గలిగినది. మన మింక నెవ్వరినిగూడఁ గోరవలదు. అట్లుచేసినయెడల— విన్నావా?—మన కింక నేవియు నుండవు. మనము గూడ నుండము. తెలియలేదు? అది పద్ధతిగాని—

పార్వ:-సంసారవృద్ధికొఱకు మన మపేక్షింపవలసినదా? అంతయుఁ దుడిచిపెట్టుకొని పోవలయు నని కోరుకొనవలసినదా?

రామ:—పార్వతీ! ఏడనో యడవి మృగమువలె నున్నావు. నేను జెప్పిన దేదో నీకడుపునఁ బట్టనేలేదా? సంసారము దొడ్డ కావలయునని కోరుకోవలదు. నాసికావలయు నని కోరుకోవలదు. మొదలు కోరికయే వద్దన్న త్రాడుమీఁద నిల్చి నేనుండఁగా నన్నట్టయిట్ట లాగెదవేమి?

పార్వ:—మీరు మగవారు. పిల్లలు లేక పోవుటచే నే నెంత క్షోభపడుచున్నానో మీకుఁ జెప్పినను తెలియదు. నేను భద్రాచల రామదేవునకు మ్రొక్కుకొన్నాను. "రామచంద్రప్రభూ! నీతిరునాళ్లకు నీగుడికి వచ్చి నిన్ను సేవించుకొందుము. నిన్ను సేవించుకొన్న కిమ్మట మా కొక్కబిడ్డ నిచ్చి రక్షింపుము రక్షింపుము. రామయ్యతండ్రీ!" యని మ్రొక్కుకొన్నాను. మీ కిదివఱకుఁ జెప్పలేదు. క్షమింపవలయును.

రామ:—ఓసి నీబొందపడ! ఎంతపనిచేసినావే! రామదేవుఁడున్న భద్రాద్రి యేడ? రామరాజున్నయెడ్లపాడేడ? ఏడకేదారి? ఎన్నికూఁతలదూరమున్నదో యెవఁడెఱుఁగును? ఎన్నిగుట్ట లెక్కవలెనో? ఎన్ని పాటి రేవులు దాఁట

వలెనో? మననాడా? మనపాడా? మనగోఁగాకు మనదోసకాయ యూడ దొరకునా? ఏమి పార్వతీ! నీకేండ్లు మీఁదఁబడినకొలఁది బుద్ధి వెనుకఁబడుచున్నది? దారికష్టము లాడఁ బెట్టి కొడుకునిమ్మని అడిగినప్పుడు రామదేవుఁడు మనలఁగూర్చి యేమనుకొనునో రవంత యాలోచించినావా? ఇట్టచేయవయ్యా అట్టచేయవయ్యా యని రామదేవునికి నీవా చెప్పుట? ఆయనకుఁ జెప్పుటకు మన మెవరము? ఎల్లపాటిలో వారందఱు నెవరికిఁ దోఁచినట్లు వారు తల కొకమాట రామదేవునితోఁ జెప్పి చేయు మనునెడల, ఇఁక రామదేవుఁ డన్నవాఁ డెందుకు? నీ మలపసన్యాసయ్యలకోరికల ప్రకారమాయన నడవవలసినదా? ఆయనయిష్టమా? మనయిష్టమా? అదిగాక యడుగుకొని యడుగుకొని పుచ్చుకొనుట యేమంతగొప్ప?

పార్వ:—నాకుఁ దెలిసియో తెలియకయో యట్లు మ్రొక్కుకొంటిని. మనము భద్రాచలయాత్రకుఁ బోవలసినదినములు సమీపించుచున్నవి. అందుచే గింజలమ్ముకొని కొంత సొమ్ము చేసికోవలసి యున్నదికాదా?

రామ:—గింజలమాట కేమి సొమ్ముమాట కేమి కాని 'మన' మనుచున్నా వెందులకు? భద్రాచలయాత్ర నా కెందుకు? నామట్టుకు వంటయింటిఁగూటిలో నున్నరామదేవుఁ డెంతో భద్రాచలరామదేవుఁడు నంతే - భద్రాచల మేడనో యున్నదనుకొన్నావా? రాముఁ డేడ నున్నాఁడో యాడనే భద్రాచలము. రామునిబట్టి భద్రాచలముకాని భద్రాచలముఁబట్టి రాముఁడు కాఁడు. తెలియలేదు? ఈ వ్యవహారమంతయు నాడఁబెట్టి ముందిది చెప్పు. నేను భద్రాచల మెందుకు?

పార్వ:—మనమిద్దఱముకూడ వచ్చెదమని మ్రొక్కుకొంటి నని చెప్పలేదా?

రామ:—నన్నుఁగూడఁదీసికొనివత్తునని మ్రొక్కుకొంటివా? నీ వేడకుఁ బోవుదువో యాడకు నన్నుఁగూడఁ గట్టకట్టుకొని పోవుదువా? నేను నీచేతిలోనికాసండి ననుకొన్నావా? మొలలోనితాళపుఁజెవి ననుకొన్నావా? ఓయబ్బ! నీ కెంత తుఱ్ఱు బడాయించినదే! (ఎంత పొగరెక్కినదే).

రామరాజుగా రిట్లు పలుకుచుఁ జేతిలో నున్నపూచికపుల్లను బైకెత్తి తెప్పపాటుకాలమట్టె బింకముగఁ బట్టుకొని భార్యవంకఁ జూచెను. పార్వతమ్మ భర్తను గాంచి తెల్లబోయి యట్టె కనుల వ్రాల్చి యూరకుండెను. యాథాలాభముగఁ బలికిన తనకఠినవాక్యములకు భార్యమనసు నొచ్చినదేమో యని యామెవంకనే చూచుచు విస్తరి కుట్టినచోటనే కుట్టి "సరే! కనకయ్యసిద్ధాంతిని బిలిపించి ముహూర్తము పెట్టించు. ఇద్దఱముకూడఁ బోవుదము. కాని యొక్కయేర్పాటుమాత్ర మున్నది. అదేమనగా- మఱి- కొడుకు నిమ్మని రామదేవుని నీవు కోరుకోవలసినదే కాని నేను గోరను. కోరుకోమని నీవు నన్నాడ నిర్బంధపెట్టవద్దు. తెలియలేదు? అది సంగతి" యనియెను. భార్య యందులకు సమ్మతించెను. అంతలోఁ బదుగురు బ్రాహ్మణులు భోజనమునకు వచ్చిరి. భార్యాభర్తలు లేచి వారికర్ఘ్యపాద్యము లిచ్చి సేవించి, వారు భుజించిన వెనుక భుజియించిరి.

II

భద్రాచల రామదేవుని సేవించుకొని భార్యాభర్తలు స్వగ్రామమునకువచ్చి బ్రాహ్మణ సమారాధనాదులు జరిగించుకొని నిత్యాతిథి పూజ గావించుకొనుచు రామచంద్రమూర్తి వార్తలు చెప్పుకొనుచుఁ బసుసంరక్షణ మొనర్చుకొనుచు మహానందమునఁ గాలక్షేపము చేయుచుండిరి. ఒకనాఁటిరాత్రి పార్వతమ్మ "ఇదిగో మనపై రామదేవునకుఁ బూర్ణమైన యనుగ్రహము కలిగిన ట్లగపడుచున్న ద"ని చేఁటయంత మొగము చేసికొని యుప్పొంగుచు భర్తతోఁ బలికెను. బత్తెదూడమెడలో మువ్వలుగట్టుటకు దారము పేనుచున్న రామరాజుగా రామాటలు వినిపించుకొనలేదు. "మాటలాడ రేమి? నే నెంతో ముచ్చటపడి చెప్పినమాటలను జెవిపెట్ట రేల"యని ముద్దులు గుడుచుపిల్లవలెఁ బలికి, భార్య, దీపమునొద్దఁ గూరుచుండి పేనుచున్న భర్తయొద్దకు వచ్చి బుజముపైఁ జేవైచి యాతనిని గదల్చెను. "ఏమంటివో మఱలఁ జెప్పుమ"ని భర్తయడుగ, "మనపై రామచంద్రమూర్తికిఁ బూర్ణానుగ్రహము వచ్చిన ద"నెను. "ఆయన కెప్పుడు మనపైఁ బూర్ణానుగ్రహమే - ఈనాఁడు క్రొత్త యేమున్నద"ని భర్త బదులుచెప్పెను. "ఆమాట సరి లెండు. నేఁ డొక గొప్పవిశేష ముండుటచేత నే చెప్పితి"నని భార్య యనఁగ "నదేమో నబ్బ! నాకు నిదానముగాఁ బట్టుకో లేదని" భర్త పలికెను. భద్రాచలయాత్రవెళ్లి నట్లే జ్ఞప్తియున్నది. కాని యెందులకు వెళ్ల వలసివచ్చినదో యాసంగతి రామరాజుగారు మఱచియే పోయినారు. "కొడుకును బ్రసాదింపుమని భద్రాద్రిరాముని నేను గోరుకొనిన మాట మఱచియే పోయినారా? బత్తెదూడ మెడలోనికి దార మేలాగున పేనుచున్నారో మనబిడ్డని నడుమునకు బంగరుమువ్వలు కట్టుటకు దారము నాలాగుననే మీరు పేనుట యిఁక నేఁడు మాసములకు సిద్ధింపఁగలదు" అని పార్వతమ్మ, పుట్టెఁడుసిగ్గుతో మూఁడు పుట్లనేర్పుతోఁ బదునాలుగుపుట్ల సంతోషముతోఁ బలికెను. "ఓసబ్బ; ఇంతేకాదా? నే నేదో యనుకొన్నాను. రామదేవునకు దయ వచ్చునెడలఁ గొడుకు నిచ్చుట యొకవిశేషమా యేమి?ఆయనయెంతమందికిచ్చుచున్నాఁడో!" యని భర్త పలుకఁగ "రామదేవుని కిది గొప్ప కాదు కాని యిన్నియేండ్లకు నాకుఁ గడుపు ఫలించుట మనకు గొప్ప కాదా"యని పార్వతమ్మ పలికెను. "చూడు! కోటప్పకొండతీర్థములోఁ గొన్నమువ్వ లాచిలుకకొయ్యనున్న చిన్నగుడ్డమూఁటలోనున్నవి. ఈడ కవి తోడుకొనిరా"యని భర్త భార్యను గోరఁగ "ఈరాత్రియే దానిమెడలోఁ గట్టవలయునా - రేపు కట్టఁగూడదా?" యని పలుకుచు నామువ్వలు తెచ్చి యాతనియెదుట నామె యుంచెను. వానిని దారమున గ్రుచ్చి యాదండను దూడ మెడఁ గట్టుట కాతఁడు పసువులపాకలోనికిఁ బోయెను.

III

ఆపల్లెటూరఁ జెఱువునొద్ద నుదయమున స్నానాదికృత్యములకుఁ జేరినస్త్రీలు పార్వతమ్మనుగూర్చియే మాటలాడుకొనుచుండిరి. "అదృష్టము చెప్పవచ్చినప్పుడు పార్వతమ్మదే

యదృష్టమమ్మా"యని బోరలించిన బిందె మీఁదఁ గూరుచుండిన యొకయిల్లాలనఁగ సూరమ్మ "చిన్నీ! (పిన్ని) పార్వతమ్మకుఁ గడుపనియే నీనమ్మకమా? నేను మొన్నఁ జూచినాను. నాల్గవనెలకుఁ దగినజాడలు నాకేమియుఁ గనఁబడలేద"ని యొకకాంత కాలియందెలిసుకతోఁ జంతపండుతోఁ దోముకొనుచుఁ బలికెను. 'వెంకమ్మవదినె యెప్పుడెడ్డమనగాదెడ్డమే-జాడలు కనబడకపోవుట యేమి? నిక్షేపములాగునఁ గనఁబడుచున్నవి" అని యొకబాలవింతువు పలుక, "నౌనమ్మా! ఇల్లు నిండునట్లు కని పెంచినదానవు. నీకుఁ దెలియక నాకుఁ దెలియునా యేమి?" యని వెంకమ్మ సుబ్బమ్మవదినెను బరిహసించుచుఁ దుంట్లపైఁ జఱచుకొనెను. "జాడలు కనఁబడుచున్నవో లేదో నేను జూడలేదు కాని వన్నింపులయిన (పునస్సంధానము) యిఱువదియైదేండ్లకు నెలతప్పుటమాత్రము నేనెక్కడను విన లేదమ్మా"యని సగముబట్ట కట్టుకొని మిగిలినసగము నుదికికొనుచున్న యొకలజ్జావతి పలుక, "లేకేమి పుల్లమ్మత్తా! మాయాడుబిడ్డ యత్తగారిమేనమామకూఁతున-కమ్మా-చెప్పిన నమ్మవేమో-కాఁపురమునకువచ్చినతరువాత ముప్పది రెండేండ్లకుఁ గడుపమ్మా" యని నీటిలో మొలలోఁతువఱకు దిగి పసపు మొగమునకు రాచికొనుచున్న కోటమ్మ పలికెను. "ఇట్టియకాలపుఁగడుపులు సాల్లాకావమ్మా! తల్లిగండాల కిట్టివి దాఁపురించునమ్మా-రెండుతలలు నేర్పాటగువఱకు నేమియు ననుకొనుటకు వీలులే"దని యంట్లు తోముకొనుచున్న యొకయంగన మంగళప్రదముగఁ బలికెను- "పిచ్చమ్మతల్లీ! నీవెఱ్ఱి కాని. రామరాజుగారు రామభక్తుఁడమ్మా! భద్రాచలరామదేవు నాతఁడు గట్టిగా మ్రొక్కుకొనుటవలన నిట్లుకలిగినదఁట. హాసామాషీకడుపులకు నీవన్న భయము కాని వరప్రసాదముచేఁ గలిగినవానికి నదరు బెదరు నుండవమ్మా!" యని సూర్యనమస్కారములు చేసికొనుచున్న తిమ్మయ్యమ్మ పలికెను. "ఉచ్చమ్మక్కయ్యా! నీవు కాఁపురమునకు వచ్చి పండ్రెండేడ్లయినది. కాఁబోలు. భర్తను దీసికొని భద్రాచలము పోయి రామదేవున కేదో మీఁదుకట్టుకొని కట్టుదిట్టముగా మ్రొక్కుకోఁగూడదా"యని యుదివఱకుఁ దోమ తోలచినయట్లు కఱ్ఱతో వీఁపు గోకికొనుచున్న యొకకాంత పలుక, "భర్త! ఎందుకువచ్చినభర్త! దుర్గమ్మక్కా! నాబ్రదు కేమడుగుదువు? ఆమాత్ర పచ్చికబుచ్చిక యల్లాయపుల్లాయ (అన్యోన్యప్రేమగల) సంసారమేయై చెప్పినట్లు విని మసుకఁగలభర్తయే యైనయెడల నా కీకర్మ మెందుకమ్మా" యని తుడుచుకొన్నతలను జాడించుకొనుచు నచ్చమ్మ పలికెను. "అందరితో నొక్కమాట. మాయింటికేసనుండియో యొకదూరపునాడునుండి యొక గొప్పసిద్ధాంతి వచ్చినాఁడు. ఆయనకుఁ దెలియనిసంగతి లేదు. ఆయనను మధ్యాహ్నము తనయింటికిఁ దోడుకొనిరమ్మని పార్వతమ్మ నాతోఁ జెప్పినది. మీరంద అడకు రండు. ఎవరికిఁ దోఁచినది వారడుగవచ్చును" అని కనకయ్యసిద్ధాంతిభార్య పోచమ్మ పలికెను.

* * *

ఆనాఁటిసాయంకాలమునందు రామరాజుగారు పొలమునుండి వచ్చి గేదెలను గోవులను దూడలను యథాపూర్వముగాఁ బరామర్శించి లోనికిఁ బోయిరి. కాళులు గడుగుకొనుటకు నీరిచ్చుటకై భార్యరాలేదు. నూతియొద్దకుఁ బోయి పాదప్రక్షాళన మొనర్చుకొని వంటయింటిలోని కాతఁడు పోయెను. అక్కడఁ గూడ భార్యలేదు. వచనప్రయత్న మేమియుఁ గానఁబడలేదు. అంత పడుకగదిలోని కాతఁడు పోయి చూడఁగ వట్టినేలపైఁ బార్వతమ్మ పండుకొని యేడ్చుచుండెను. భర్తను జూచి పట్టరానిసంతాపమునఁ బెద్దగోల పెట్టి యేడ్చెను. రామరాజుగారు తెల్లఁబోయి భార్యయొద్దఁ గూరుచుండి యామెపైఁ జేయి వైచి "యేమిది యేమిది" యని పలుమాఱడిగెను. భార్య తలపై మోదుకొనుచు "భర్తం చెప్పిన మాటవినని దుర్మార్గురాలను. బుద్ధిగడ్డిదినుటచేఁ గొడుకు నిమ్మని రాముని గోరితిని. నాకుఁ గొడు కక్కఱలేదు. కడు పక్కఱలేదు. రామదేవుఁడా! నీవు ప్రసాదించిన దీనిని నీవు తీసికో నాయనా! నాతండ్రీ! రామచంద్రదేవా! యని యెలుగెత్తి యేడ్చెను. "సంగతి యేమి? వ్యవహారమేమి? ఈగొడవ కలుగుటకు మూలకారణమేమ"ని భర్తయడుగ "నయ్యో నేను భరింపలేను నాకు వద్దు. నా కక్కఱలేదు- నాకుఁ గొడు కక్కఱలేదు. ఇదిగో బుద్ధిలేక కోరుకొనినందులకుఁ జెంపలు వైచికొనుచున్నాను- మహాప్రభూ! యని యామె యేడ్చెను. బలాఢ్యుఁడైన రామరాజుగారామె నెంత వారించినను రెండుచేతులతో నెత్తుకొని మంచముపైఁ బరుండఁబెట్టి కన్నులం దుడిచి "చూడు చెప్పినమాట విను. తొందరపడవద్దు. తెలియలేదు? నిదానించుకో- సంబాళించుకో- ఇప్పుడు కలిగినసంగతి యేమి" యని బతిమాలుకొనుచు నడిగెను. "నేను జెప్పలేను. మనము తిరుగ భద్రాచలయాత్రకుఁ బోవుదము. ఆరామదేవుని రెండుకాళులు పట్టుకొని 'నాకు దయచేసిన పుత్త్రభిక్షము నా కక్కఱలేదు. అనుగ్రహింపుము మహాప్రభూ!" యని మొఱ్ఱపెట్టుకొందును. అని పార్వతమ్మ పలుకునంతలోఁ గనకయ్యసిద్ధాంతి వచ్చి 'పార్వతమ్మక్కా- నీ కీవెఱ్ఱి యేమి? తూర్పు సిద్ధాంతాలు స్థిరమనుకొన్నావా యేమి? మొదలుశాస్త్రానికే పార్వతీదేవిశాపమున్నది. ఆయవకతవకముండకొడుకు కేదో పేలఁగ నదియే పట్టుకొని గుండె పగులఁబెట్టుకొనుట తగునా? తరువాత నేను నాలుగుచీవాట్లు పెట్టినాను. ఆతఁడు చెప్పినదానిని ముక్కముక్కలక్రింద ఖండించినాను. నామాట నమ్ముమ"ని పార్వతమ్మను మందలింపఁగ, "నాయనా! నీ మాట నిజమేనా యని పార్వతమ్మ యడిగెను. నాది సిద్ధాంత మని కనకయ్య చెప్పుచుండఁగ, "మొదట దీనికి మూలాధారమైన గొడవయేమ"ని రామరాజుగారు పట్టుదలతో నడిగిరి. "ఏమియు లేదు- ఎవఁడో పంచపక్ష్యుపాసకుఁడు- త్రాగుబోతు ముండకొడుకు మీరు పొలములో నుండగా నిక్కడకు వచ్చి పార్వతమ్మకుఁ గొడుకు గల్గుననియుఁ గొడుకు పుట్టినగంటలోపలఁ దండ్రి మరణించుననియుఁ జెప్పిపోయినాఁడు" అని కనకయ్య చెప్పెను-

'హోహోహో'యని రామరాజుగారు గూడ కూలి పడునంతనవ్వు నవ్వి, 'ఓయబ్బ! ఇంతే కదా! ఈమాత్రపు వ్యవహారమున కింతలొల్లి(అల్లరి) యెందులకు?' కని పలికి కనకయ్యయెదుటనే యిరుగుపొరుగువారికి వినంబడునంత గట్టిగ భార్యను ముద్దుపెట్టుకొని 'సిద్ధాంతీ! నీ విటఁ గూరుచుండుము, నేనుబోయి వంటచేసికొందు" నని పడమటింటిలోనికిఁ బోయెను.

సిద్ధాంతి యామెయొద్దనే కూరుచుండి వృద్ధపారాశర్యమునుండి "భాగ్యవ్యయాధిపత్యేన రంధ్రేశో నశుభప్రదః"అని చదివి ఊఁ యని రెండుమారులు మూల్గి,

"భాగ్యవ్యయాధిపత్యేన రంధ్రేశో నశుభప్రదః,
తత్తత్ఫలానిప్రబలా ప్రదిశేతాంతమో గ్రహా"

యన్న శ్లోకమును జదివెను. ఆశ్లోకమునకుఁ బార్వతమ్మ కర్థము తెలియకపోవుట యాశ్చర్యముకాదు. సిద్ధాంతికే తెలియలేదని చెప్ప వలసివచ్చినది. ఎందువలన? దానికర్థము లేక పోవుటవలన. ఒకశ్లోకములోఁ బూర్వార్థము మఱియొకశ్లోకములో నుత్తరార్థమును లంకెవేసిన శ్లోకమున కర్థముండునా?

కం. "అన్నాతిఁ గూడ హరుఁడవు
అన్నాతిం గూడ కున్న నసురగురుండౌ
బంతులు తామర మొగ్గలు
దంతులకుంభములఁ బోలు తరుణీకుచముల్"

అన్న కలగోలుగంప కందపద్యశ్రాద్ధమున నర్థసమన్వయ ముండునా? కాని శ్లోకము వలన మాత్రము పార్వతమ్మకు ధైర్యము హెచ్చయ్యెను. పంచపక్ష్యుపాసకుఁడు శ్లోకమేదియుఁ జదువలేదు. శ్లోకము చదివిన కనకయ్యయే పంచపక్ష్యుపాసకునికంటె నెక్కువవాఁడని పార్వతమ్మ నమ్మెను. వట్టిమాటలలోఁ కంటె గణబద్ధమైనమాటలలోఁ బ్రమాణశక్తి హెచ్చున్నది. అందులోఁ దెలియని భాషలోఁ జదివినదానికి మఱింతప్రమాణ శక్తి యున్నది. మనసు కొంత కుదుటఁ బఱచుకొని పార్వతమ్మ భర్తను వారించి తానే వంటచేయుటకు వంటయింటిలోనికిఁ బోయెను. కనకయ్య యింటికిఁ బోయెను.

IV

పంచపక్ష్యుపాసకుఁ డాయూరికాంతల కెందఱికో ప్రశ్నలు చెప్పెను. వారివారికి నిదర్శనము లిచ్చుచున్నట్లు పార్వతమ్మ వినుచుండెను. "తనకుమాత్ర మేల నిదర్శన మీయకుండును? అని తలపోసికొని యేడ్చుచుండును. అయిదవనెలలో గాజులు లేవు. సీమంతము లేదు. సూడిదలు లేవు. ముద్దుముచ్చటలేమియు లేవు. ఎవ్వ రేమి చెప్పినను వినక యెంగిలిలంఘనములు చేయుచు కృశించి మంచమున కంటుకొని పోయినట్లు పండుకొని యొక్కరీతిగ నామె యేడ్చుచుండెను. అక్షరాభ్యాసమే యెఱుఁగని రామరాజుగా రేమి యితిహాసములు చెప్పి యామె నోదార్పఁగలరు? అదిగాక భర్త కనులఁ బడుసరి కామె గొల్లున నేడ్చుచుండును. ఆయూరిలోనికాంత లెందఱో యనుదినమును మధ్యాహ్నమున వచ్చి యామెయొద్దఁ గూరుచుండి యేవో యుబుసు లాడుచుఁ గాలక్షేపము చేయుచుండిరి. భర్త తనయెదుట లేనప్పు డాతఁ డెదుటికి వచ్చినదాఁకఁ దొందరపడి యాతనిని బదేపదే పిలుచుచుండును. వచ్చినతర్వాత నాతనిఁ జూచి హోరున నేడ్చుచుండును. తానుగనఁ

బడుటచేనామె మఱియింతదుఃఖించుచున్నదని భర్త రవంత యావలికిఁ బోవఁగ, "రండు. రండు. రాకేమి రాకేమి" యని వచ్చినదాఁకఁ దపించి పోవును.

రామరాజుగా రొకనాఁడు మధ్యాహ్నమున వచ్చి "పార్వతీ నీవేడ్చినట్లయిన నే నిక్కడ కింక రాను. సంగతి యేమిదో వ్యవహారమేమిదో- తెలియలేదు? సందర్భమేమిదో- అదోయిదో ఉన్నదందువా మఱి లేదందువా? అది మనము రాపాడించుకొనవలసినది కాని ఊఁ- తెలియలేదు? అది సంగతి" యని యుపన్యాసించెను. దానికర్థమేమాత్రము తెలియక కాఁబోలు పార్వతమ్మ "మీయిష్టము ఏది చెప్పవలయునో చెప్పుడు నేను వింటు" ననెను. వా రిట్లు మాటలాడుకొనిరి.

రామ:—పార్వతీ! మాతాతగా రిప్పుడున్నారా?

పార్వ:- ఆమాట యిప్పుడెందుకు? లేరు

రామ:—ఎందుచేత లేరు?

పార్వ:—చనిపోవుటచేత.

రామ:—సరే- అట్ట బాటలోనికి రా. ఎందుకుఁ జనిపోవలయును?

పార్వ:— ఏమి చెప్పఁగలను. కాలము వచ్చుటచేత.

రామ:—మాతండ్రిగారిమాట యేమి?

పార్వ:—ఆయనకును గాలమువచ్చినది.

రామ:—అట్టయిన మఱినామాట యేమనుకొన్నావు. తొందరపడకు. ఆఁగు. మనుష్యుఁడైనవాఁ డెల్లఁ జనిపోవకతప్పదు తెలియలేదు? గొడ్లు గోదలమాట రవంతసేఁ పాడఁబెట్టు. వెంకటాద్రినాయఁడుగారు వెళ్లిపోయినారు సుఖపడినారు. ధర్మప్పారావుగారు కాలమునేమైనఁగాని రొకాయింపఁ(అడ్డుకోఁ)గలిగినారా? వెడలిపోవుట యనఁగా నేడకోనా? రామదేవునిదగ్గఱకు - తెలియలేదు? ఇఁక దుఃఖాలతోఁ బని యేమున్నది?

పార్వ:—(ఏడ్చుచు) కొడుకు పుట్టిన కెంటనే మీరు మమ్ము విడుచుటకు నిశ్చయపఱచుకొన్నారా?

రామ:—నిశ్చయపఱచినవాఁడు రామదేవుఁడు. మన మెవరము? అందఱిమాట యంతే.

అయ్యో! నిశ్చయమేనా! నిశ్చయమేనా యని పార్వతమ్మ వెక్కివెక్కి యేడ్చెను. రవంతసేఁ పచ్చుటఁ గూరుచుండి రామరాజుగారు పొలములోనికిఁ బోయిరి. ఎండఱతిథులు వచ్చినను దానొక్కఁడే వంట చేసి యందఱకుఁ బెట్టుచున్నాఁడు. భార్య చింతించుచున్నదన్న చింతతక్క తనచింత యేదియు నాయనకు లేదు. మట్టెతిను దూడలమూఁతులకు బుట్టలల్లుచున్నాఁడు. ఆవులకు దృష్టిదోషము తగులకుండఁ గంబళిత్రాళ్లు పేనుచున్నాఁడు. జొన్నపిండి చీమలకు వేయుచున్నాఁడు. జొన్నరొట్టెలు బీదపిల్లల యింటికిఁ దీసికొనిపోయి పెట్టుచున్నాఁడు.

V

ఒకనాఁటిరాత్రి రెండు యామములకుఁ బార్వతమ్మకు నెప్పు లారంభించినవి. ఆరాత్రి సామాన్యముగనుండెను. మఱునాఁటియుదయు

మున హెచ్చుగా నుండెను. ఈసంగతి తెలియుటచే నూరిలోని యనేక కాంతలు పురుషులు వచ్చి రామరాజుగారియింటిలోఁ గూరుచుండిరి. ఆయనకుఁ బుత్రోదయ మగు నని సంతసింతురా? ఆయననిర్యాణము సమీపించుచున్న దని దుఃఖింతురా? స్తంభీభూతులై కూరుచుండిరి. ఏమియుఁ దోఁపక యొకరి నొకరు చూచుకొనుచుఁ గూరుచుండిరి. అట్టి సమయమున రామరాజుగా రేమి చేయుచున్నారో? ఆవ్రనాలుకకుఁ దొండగఱి యైన దని దాని కుప్ప రాచుచున్నారు. ఉప్పురాచుచున్న రామరాజుగారు రాయించుకొనుచున్న పశ్వకంటె నెక్కువవారు కారని వారిలోఁ గొంద అనుకొనిరేమో ఎట్లు తెలియును? స్త్రీలు బుగ్గలు నొక్కుకొనిరి. పురుషులొకరి నొకరు చూచుకొని పెదవులు విఱుచుకొనిరి.

క్రమముగాఁ బార్వతమ్మకు నొప్పులు హెచ్చయినవి. సాయంకాలము నాల్గుగంటలకుఁ బుత్రుఁడు కలిగెను. పార్వతమ్మ గదిలోనుండి యేడ్చుచున్నది. అక్కడి స్త్రీ లందఱు కన్నులొత్తుకొనిరి. రామరాజుగారు పుత్రోదయ మైనవెంటనే స్నాన మొనర్చి విభూతిని ధరించి యందఱయొద్దకు వచ్చి మందహాసముతో నటఁ గూరుచుండెను. "అయ్యా మీకుఁ గుమారుఁడు కలిగినాఁడు సంతోషమే" యని యొక్కఁడైన నాయనతో ననలేదు. అందఱుకూడఁ బ్రతిమలవలెఁ గూరుచుండిరి "నాయనలారా! మాతండ్రిగారు నాకు తిరిగి పుట్టినారు సంతోషమే. మీ రిడనే ప్రొద్దుటినుండియుఁ గూలఁబడి యున్నారు. మీ రీపాటి కిండ్లకుఁ బొం డనీ" రామరాజుగారు పలికిరి. "తొందర లేదు. సాయంకాలమగువఱకుండు" మనివారనిరి. "సరే"యని యాతఁడు లేచి "చీమలకుఁ బిండి వైచి పిల్లలకు రొట్టె లిచ్చి త్వరలోనే వత్తు"నని వీథిలోనికిఁ బోఁబోవుచుండగ "నొక్కగంటవఱకైన మీరిక్కడనుండి కదలవలదని వారందఱేక గ్రీవముగఁ బలికిరి. కనకయ్యసిద్ధాంతి లేచి "పిండిరొట్టెలు నేను వైచి వచ్చెదను. మీ రిట కూరుచుండు" డనిపలికి లేచినరామరాజుగారిని రెండుచేతులు పట్టుకొని కూరుచుండఁబెట్టి వీథిలోనికిఁ బోయెను. "ఓయబ్బ! నా కీనిర్బంధ మేమయ్యా!" యనుచు రామరాజుగారటనే కూరుచుండిరి. అయిదయినది- ఆఱయినది. దీపములు పెట్టినారు ఏడుగంటలైనది. "రామరాజుగారూ! ఇఁక బ్రదికినారయ్యా"యని యందఱాయన నభినందించి పంచపక్షిని బనికిమాలినముండకొడు కని తిట్టి యెవరియిండ్లకు వారు పోయిరి.

రాత్రి పార్వతమ్మ సుఖముగా నిద్రపోయెను. తెల్లవాఱినపిమ్మటఁ దరుగఁ గొందఱు బ్రాహ్మణులు రామరాజుగారియింటికి వచ్చిరి. రామరాజుగారు స్నానముచేసి భస్మధారణ మొనర్చుకొని వారినందఱను గౌరవించెను. "రామరాజుగారూ! ఇది మీ బ్రదుకు కాదు. గ్రామమందలియ శేషజనుల బ్రదుకని నమ్మవలయును"అని కనకయ్యసిద్ధాంతి పలుకగ "జీమల మాట పశువులమాట చెప్పక పోయితివేల" యని మఱియొకరు రవంత చేర్చిరి. అందఱు

మహానందమొందుచుండిరి. రామరాజుగారిని జూచుట కింక ననేకులు వచ్చుచున్నారు. వారి కందఱకుఁ, దగినతా వింటిలో లేకుంటచేఁ గాఁబోలు రామరాజుగారు వారి కెదురుగ వీథిలోనికి వచ్చి వారిని గౌరవించి వీథిలోనే నిలువఁబడిరి. రామరాజుగారి నందఱు పదేపదే యభినందించిరి. "ఓయబ్బ! బ్రదికియున్నందులకు నన్నింతగా నభినందించుచున్నా రేల?- బ్రదికియున్నందుల కెవ్వరినిగూడ నభినందింప నక్కఱలేదు. తెలియలేదు? నన్ను మీ రభినందింపఁదలఁచుకొన్నయెడల నే నిప్పుడు చెప్పఁబోవుదానికై యభినందింపుఁడు. అప్పుడైనను వద్దనియే నాకోరిక- ఆసంగతి యేదనగా- అది నా కడుపులోనే పెట్టుకొన్నాను. నేను భద్రాచలములో నుండగా నొకరాత్రి నాకు స్వప్నము. రామదేవుఁడు కనఁబడి నీవు పై వైశాఖశుద్ధైకాదశినాఁడు నాల్గుగడియలప్రొద్దెక్కున్నప్పుడు తనువును ద్యజించి నాసన్నిధికిఁ జేరెద వని చెప్పెను 'ఓయబ్బ! అంత దూరపువాయిదా వేసినా వేమయ్యా! నీయిష్టాని కడ్డేమున్నదయ్యా! నామట్టుకు నే నిప్పుడు సిద్ధముగా నున్నా'నని నేను రామదేవునితోఁ బలికితిని. ఈదినమే యాయేకాదశి. నాల్గుగడియలు కూడఁ గావచ్చినది" అని రామరాజుగారానందపరవశులై పలికిరి. అందఱును దెల్లఁబోయిరి.

ఇంతలోఁ బాలికాపువాఁడొకఁడు గడ్డిమోపు తలపైఁ బెట్టుకొని రామరాజుగారి యింటికి వచ్చుచుండెను— "వీరన్నా! నిన్న సాయంకాలమునఁ దోడుకొని రావలసినమోపిప్పుడు తెచ్చితివా? రాత్రి పశువులకు గడ్డి లేకపోవుటచే నేనెంత కటకటలాడిపోయితినో" యని రామరాజుగారు వానితో ననిరి. "బాబూ! నిన్న సాయంకాలమునఁ దేలు కుట్టినది. అందుచే రాలేకపోయినా"నని వాఁడు పలుకుచు గుమ్మపు మెట్లెక్కుచుండెను. "వంగు వంగు- మోపు పైనఁ దగులును" అని రామరాజుగారు కేకవేయుచునే యున్నారు. ఇంతలో



మోపు వానితలమీఁదినుండి తిరుగఁబడి మెట్లమీఁదనుండి దొరలుచు వీథిలోఁ బడెను. దానిలో రాత్రి యేవేళనో దూరి యటనే నిద్రించి మోపు క్రిందఁబడుటతోడనే బెదరిపోయిన త్రాఁచుపా మొక్కటి యీవలకు వచ్చి రామరాజుగారిని గాలిపైఁ గఱచెను. రెండుచేతులు పైకెత్తి "రామచంద్రప్రభూ! దయగలిగినదా! దయగలిగినదా!" యని యానందబాష్పపూరితలోచనుఁడై రామరాజుగారఱచి "సిద్ధాంతీ! వసారాచూరిలో దర్భలు జాగ్రత్తపెట్టినాను. ఈడ కవి తోడ్కొనివచ్చి యాతిన్నెమీఁద పరవవయ్యా! నీకుఁ బుణ్యముః కలుగునయ్యా!" యనిపలికి యాతఁడట్లుసేయఁగ దానిపై శయనించి "రామా! రాఘవా! రాజీవలోచనా!" యని స్మరించుకొనుచు మందహాసముతో నస్తమించెను.

(భారతి - మాసపత్రిక - మే, 1924)

'ఆశామృతము'

దామరాజు పుండరీకాక్షుడు గారు

నీవు లేకున్న నిజముగా నిఖిలప్రాణి
కోటి కాధారమే లేదు, కొదువలేని
పూలుకాయలు పిందెలు పూసి కాచి
లతలు లత లల్లుకొనిపోయి జతలుజతలు
కలసి మెలసియు జగమెల్లఁ గలయఁబార
నిత్యకళ్యాణమున సృష్టి నిలిపినావు,
అఖిలప్రాణప్రదంబ! యాశామృతంబ!

కాంతిబింబంబుపై నాశఁ గలువపూవు
కారుమబ్బులందాశఁ జకోరజాతి
దినకరుని జూచునాశఁ బద్మినికులంబు
మోక్షసౌఖ్యంబు లందాశఁబూని నరులు
లోకనాటకమునఁ బాత్రలుగ నటించు
చుందురేగాని నిన్ బాసియుండఁగలరె
అఖిలప్రాణప్రదంబ! యాశామృతంబ!

మాయసంసారజలధి నమాయకునకుఁ
గానికష్టంబులన్ గుందుమానవునకు
ఘోరపాపాటవులఁ జిక్కువానికైన,
విరహతాపాగ్నిచేఁ గాలుప్రియులకైన,
కారుచీకట్లుగ్రమ్ము నాకాశవీథి
మినుకుమినుకున మెరసెడు మింటిచుక్క-
రీతి, నభయం బొసంగెడులీలఁ జూపి
ధైర్యమొనగూర్చి నీయమృతంబుఁ జిలుకు
చుందు, వాశామతల్లి, నీయందె జగము
లన్నియు వెలుంగు, నీశక్తి నెన్నఁదరమె
అఖిలప్రాణప్రదంబ! యాశామృతంబ!